## క్లుప్తంగా

### అధికారులతో కలెక్టర్ సమీక్ష



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సైదాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ హరినారాయణన్ సమీక్షించారు. బుధవారం ఆయన మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం, ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, కులగణన కార్యక్రమాల అమలు తీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంఈఓ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### విరగబూసింది!



విపరీతంగా పూసిన పూత

సైదాపురం: మామిడి పంట ఈ ఏడాది కలిసి వస్తోందని రైతులు ఆశిస్తున్నారు. చెట్లకు బాగా పూత రావడమే ఇందుకు కారణం. తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంలోని సైదాపురం మండలంలో సుమారు 500 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఈ తోటల్లో చెట్లలో విస్తారంగా పూత వచ్చింది. పూత పిందెగా మారి..పంట చేతికి వస్తే నాలుగు రూపాయాలు కళ్ల చూస్తామని రైతులు నమ్మకంగా ఉన్నారు. పూతను కాపాడుకోవడానికి సస్యరక్షణ చర్యల్లో నిమగ్నమయ్యారు. అయితే ప్రస్తుతం కురుస్తున్న పొగ మంచు రైతులను కలవరానికి గురిచేస్తోంది. దట్టంగా కురుస్తున్న మంచుతో పూత రాలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

### దేశభక్తి కలిగి ఉండాలి



చందనను అభినందిస్తున్న అధ్యాపకులు, ఎస్‌ఐ

సూళ్లూరుపేట: విద్యార్థి దశ నుంచే దేశభక్తి కలిగి ఉండాలని ఎస్‌ఐ రహీంరెడ్డి పేర్కొన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని కే చందన ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే పరేడ్‌లో ఎన్‌ఎస్‌ఎస్ తరుపున పాల్గొని, తిరిగి కళాశాలకు విచ్చేసిన సందర్భంగా కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కే చందన కళాశాలకు విచ్చేయగానే అందరూ ఘనంగా స్వాగతం పలికారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌ఎల్‌బీ శంకరశర్మ అధ్యక్షతన నిర్వహించిన అభినందన సభలో ఎస్‌ఐ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని డిగ్రీ కళాశాలలో చదువుతున్న చందనకు ఇంత చక్కని అవకాశం రావడం నిజంగా ఆమె తల్లిదండ్రులు చేసుకున్న పూర్వజన్మ సుకృతమనే చెప్పాలన్నారు. ప్రిన్సిపల్ శర్మ, వైస్ ప్రిన్సిపల్ విక్టోరియారాణి, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్లు, పీ ఏడుకొండలు, బీ శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం



కాలిపోతున్న కారు

గూడూరురూరల్: కారులో షార్టు సర్క్యూట్ ఏర్పడి మంటలు చేలరేగడంతో ఆ కారు దగ్ధమైంది. ఈ సంఘటన గూడూరు మండలం తిప్పవరప్పాడు సమీపంలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జార్ఖాండ్‌కు చెందిన దినేష్‌కుమార్ పాండే తన కుటుంబ సభ్యులతో కలసి బెంగళూరుకు వెళ్లాడు. అక్కడ నుంచి తిరుగు ప్రయాణంలో గూడూరు మీదుగా జార్ఖండ్‌కు వెళుతుండగా తిప్పవరప్పాడు సమీపంలో రోడ్డుకు అడ్డంగా కుక్క రావడంతో దానిని తప్పించే క్రమంలో కారు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. దీంతో కారులో షార్టు సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న వారు కారులోనే చిక్కుకుపోవడంతో స్థానికులు గుర్తించి, కారు అద్దాలు పగులగొట్టి వారిని రక్షించారు. దీంతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం గూడూరు అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ విషయమై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి వివరాలను సేకరిస్తున్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

నాయుడుపేటటౌన్: మండలంలోని తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ బ్రహ్మానాయుడు తెలిపారు. తుమ్మూరు సమీపంలో స్వర్ణముఖి నది నుంచి తరచూ ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ దాడులు జరిపి తుమ్మూరు రహదారి వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# నెలలోపు సమస్యలు పరిష్కరిస్తాం



చిల్లకూరులో అర్జీలు పరిశీలిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

చిల్లకూరు: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ప్రతి సమస్యను నెల రోజుల్లోపు పరిష్కారిస్తామని తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ప్రజల నుంచి సుమారు 50 అర్జీలను స్వీకరించారు. వీటిని అక్కడిక్కడే ఆన్‌లైన్ చేసి, వాటికి సంబంధించి పరిష్కారం తేదీని కూడా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో ఇప్పటివరకు భూ సమస్యలపైనే దరఖాస్తులు అందాయని, వీటిలో ఇరువర్గాల మధ్య వివాదాలున్నవే ఎక్కువగా ఉండడంతో ఇరువర్గాల వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి, వారి దగ్గర ఎలాంటి ధ్రువపత్రాలున్నాయనే విషయాలను పరిశీలించిన అనంతరం సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములకు సంబంధించి చేపట్టిన రీ సర్వే కార్యక్రమం, ఈ పాస్‌పుస్తకాలు, హద్దురాళ్ల ఏర్పాటు, అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడం లాంటి కార్యక్రమాలతోపాటు చుక్కల భూముల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపుతుందని తెలిపారు. గిరిజనుకుల చెందిన భూములకు పట్టాలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ కలెక్టర్‌ను కోరారు. అలాగే చింతవరం ఎంపీటీసీ సభ్యురాలు మాధవి చింతవరం ఆస్పత్రిలో రాత్రి వైద్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రికి ప్రహరీ గోడ ఏర్పాటు, గ్రామంలో మరో ఓవర్‌హెడ్ ట్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వివిధ సమస్యలపై పలువురు అర్జీలు ఇచ్చారు. వీటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

# పారదర్శకంగా ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ లీలా మాధవి

దక్కిలి: ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీఓ లీలామాధవి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీల్లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరుండి కూలీలతో పని చేయించాలన్నారు. ప్రతి ఒక్కరికీ గిట్టుబాటు కూలీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు షఫీ, గిరి, సాంబయ్య, బీఎఫ్‌టీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

### మైనారిటీల పక్షపాతి జగనన్న

గూడూరురూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మైనారిటీల పక్షపాతిగా నిలిచిపోయారని వైఎస్సార్‌సీపీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మగ్దూం మొహిద్దీన్ అన్నారు. పట్టణంలోని మైనార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో ఏ పార్టీ కూడా ముస్లింలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గ స్థానాల్లో ఇన్‌చార్జిలుగా మైనారిటీలను కూర్చొపెట్టడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ నాయకులు షేక్ కాలేషా, జలీల్, అల్తాఫ్, షబీర్ తదితరులు పాల్గొన్నారు.

### వైద్య శిబిరానికి విశేష స్పందన

దొరవారిసత్రం: పూలతోట గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో బుధవారం నిర్వహించిన 104 వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యులు, సిబ్బంది ఈ సందర్భంగా సాధారణ రోగులు, బీపీ, షుగర్ తదితర దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కూడా పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### తిరుపతిని రాజధానిగా చేయాలి

నాయుడుపేట టౌన్ : తిరుపతిని రాష్ట్ర రాజధానిగా చేయాలని మాజీ ఎంపీ చింతామోహన్ డిమాండ్ చేశారు. నాయుడుపేటలో బుధవారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి తిరుపతిని రాజధాని చేయాలని ప్రదర్శనలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 300 ఏళ్ల కిందట బ్రహ్మంగా రు తిరుపతి పట్టణం మహా పట్టణంగా(రాజధాని) మారుతుందని కాలజ్ఞానంలో చెప్పారన్నారు. అన్ని సౌకర్యాలున్న తిరుపతిని రాజధాని చేసుకునేందుకు తిరుపతి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

# మెరుగైన వసతులు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ చంద్రముని



తాళ్వాయిపాడులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌రావు

ఓజిలి: పోలింగ్‌కేంద్రాలలో మెరుగైన వసతులు కల్పించాలని సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని సూచించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో త్వరగా విద్యుత్, తాగునీటి సౌకర్యం, వృద్ధులు, వికలాంగులు నడిచేందుకు అవసరమైన ర్యాంపులను నిర్మించాలన్నారు. ఓటర్ల జాబితాలో కూడా పాత ఫొటోల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలసి మధ్యాహ్నభోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయన వెంట తహసీల్దార్ నాంచారయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ చంద్రశేఖర్, ఎస్‌ఐ రవిబాబు ఉన్నారు.

#### పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, చిల్లకూరు, కొత్తూరు, తాళ్వాయిపాడు, కానూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ కేవీ ఆర్‌వీ ప్రసాద్‌రావు పరిశీలించారు. ఎన్నికల నిబంధలనల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలు పరిశీలించి, అక్కడున్న పరిస్థితులపై ఆరా తీసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీటి సౌకర్యంపై దృష్టి పెట్టామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు తేజ, వంశీ, కళ్యాణి, సర్వేయర్ సూర్యనారాయణ, వీఆర్‌ఏ కృష్ణ తదితరులు ఉన్నారు.

#### కోటలో 52 పోలింగ్ కేంద్రాలు

కోట: మండలంలో 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ నాగరాజారావు తెలిపారు. బుధవారం కోట మేజర్ పంచాయతీలోని 11 పోలింగ్ స్టేషన్లను పరిశీలించి, వసతులపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే తిమ్మనాయుడుపాళెం, వెంకన్నపాళెం, లక్ష్మక్కకండ్రిగ, తిన్నెలపూడిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీటీ మల్లికార్జున్‌రావు, ఆర్‌ఐ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

#### డీ వడ్డిపల్లెలో..

దక్కిలి: మండలంలోని డీ వడ్డిపల్లె, మాధవయ్యపాళెం, వెలికల్లు, మార్లగుంట, వెంబులూరు, కమ్మపల్లెలో పోలింగ్ కేంద్రాలను బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ముందస్తుగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రతి పోలింగ్‌స్టేషన్‌లో విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక వసతులను పరిశీలించామన్నారు. అనంతరం డీ వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల సర్వేయర్ సుబ్రమణ్యం, ఆర్‌ఐ రాజేష్‌లు ఉన్నారు.



కోట: జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజారావు



దక్కిలి: ఎగువమార్లగుంటలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

### డ్రైవింగ్ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్ అందజేస్తున్న సీఈఓ సీతారామనాయుడు

పెళ్లకూరు: మండల కేంద్రంలోని చాగణం లలితమ్మ-భాస్కరావు మెమోరియల్ ట్రస్టులో ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ పొందిన వారికి సీఈఓ పెనుబల్లి సీతారామనాయుడు చేతులు మీదుగా బుధవారం డ్రైవింగ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రాంగణంలో గత రెండేళ్లుగా 377 మందికి ఉచిత కారు డ్రైవింగ్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఇందులో భాగంగా డ్రైవింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ట్రాఫిక్ నిబంధనలు, సిమిలేటర్, కారు డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకుని సూళ్లూరుపేట ఆర్టీఓ కార్యాలయంలో నిర్వహించిన డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణత పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ట్రస్టు ద్వారా ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ పొందిన వారంతా ట్రస్టు నిర్వాహకులు చాగణం గౌరీశంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు హృషీకేశవరావు, శ్రీలక్ష్మి, వరలక్ష్మి, నాయకుడు మునిచంద్ర పాల్గొన్నారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

చిల్లకూరు: మండలంలోని మన్నేగుంటలో బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మన్నేగుంటలోని మహాలక్ష్మి ఆలయంలో సర్పంచ్ ఇరగరాజు ఏడుకొండలు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, హిందూ ధర్మప్రచార పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోను సందర్శించిన బోర్డు సభ్యుడు

వెంకటగిరిరూరల్: స్థానిక ఆర్టీసీ డిపోను ఆ సంస్థ బోర్డు సభ్యుడు రాజారెడ్డి గురువారం సందర్శించారు. ఆర్టీసీ గ్యారేజీ, కార్యాలయాన్ని పరిశీలించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో అలసత్వం లేకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఒత్తిళ్లకులోను కాకుండా పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిపో మేనేజర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ యువకుడి మృతి

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని పున్నపువారిపాళెం సమీపంలో ఉన్న రొయ్యల పరిశ్రమలో పని చేస్తున్న అస్సాం రాష్ట్రానికి చెందిన బాన్‌సెల్వీ (22) అనే యువకుడు ఆదివారం గూడూరుకు వచ్చి బైక్‌పై పరిశ్రమ వద్దకు వెళుతుండగా వరగలి క్రాస్ రోడ్డు వద్ద కారు ఢీ కొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడు నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు సమాచారం అందజేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# భూ కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ భానుప్రియ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని త్రిభువని సెంటర్ సమీపంలో సర్వే నంబర్ 227/10లో 0.48 సెంట్ల ప్రభుత్వ భూమి ఉందని, అది అన్యాక్రాంతం అవుతుందని, దాన్ని కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సమావేశంలో తీర్మానం ఆమోదించారు. పట్టణ నడిబొడ్డున రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియడం లేదని 21వ వార్డు కౌన్సిలర్ జి ఢిల్లీబాబు అన్నారు. ప్రభుత్వభూమిని గుర్తించి ఆ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య మాట్లాడుతూ గతంలో ధర్మాపురం గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తికి ఆ స్థలంలో ఏక్‌దాల్ పట్టా ఇచ్చారని, ఆ పట్టా ఒక సంవత్సరం మాత్రమే పని చేస్తుందని, తరువాత రెన్యూవల్ చేసుకోవాల్సిన ఉంటుందన్నారు. భూ కబ్జాదారులను అధికారులు ప్రోత్సహిస్తున్నారని, లేకపోతే ప్రభుత్వ స్థలాలు ఎక్కడ ఉన్నాయన్న విషయం భూ కబ్జాదారులకు ఎలా తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. 4వ వార్డు కౌన్సిలర్ నారాయణ మాట్లాడుతూ కుమ్మరిగుంటలో రూ. 20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి అధికారులు అత్యుత్సాహంతో రిజర్వుడ్ అప్రూవల్ ఇచ్చారన్నారు. అంతే కాకుండా వెంకటగిరిలో రూ. కోట్ల విలువ చేసే భూ కుంభకోణంలో అధికారులకు సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు. 16వ వార్డు కౌన్సిలర్ డీ రాధ మాట్లాడుతూ వెంకటగిరిలో ఉన్న ప్రభుత్వ ఆస్తులు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### చెంబేడు మినీరిజర్వాయర్‌కు నిధులు మంజూరు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: చెంబేడు చెరువు మినీరిజర్వాయర్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.37 కోట్ల నిధులు మంజూరు చేశారని ఎన్‌డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ కే సత్యనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతో కలిసి ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. మినీరిజర్వాయర్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించడంపై సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు పేర్కొన్నారు.

# జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



రోగులకు మందులు అందజేస్తున్న అధికారులు

సూళ్లూరుపేట: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని రాఘవయ్యపేట సచివాలయంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం పరిధిలోని వారికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పముజుల విజయలక్ష్మి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఏ శ్రీధర్, కోఆప్షన్ సభ్యు డు కే బాబారావు, పార్టీ నాయకులు ఎస్‌డీ ఫయాజ్ పాల్గొన్నారు.

### ముమ్మరంగా చెరువు కట్ట పనులు

దొరవారిసత్రం: మండలంలోని 17 చెరువుల కట్టల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఇరిగేషన్ ఏఈ కస్తూరయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చెరువుల కట్టలు పటిష్టం చేసేందుకు ఎఫ్‌డీఆర్ కింద రూ. 55 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఇటీవల వచ్చిన వరదలకు ఈ చెరువు కట్టలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎఫ్‌డీఆర్ కింద విడుదలైన నిధులతో పలు గ్రామాల్లోని చెరువు కట్టల పటిష్టం చేసే పనులు వారం రోజులగా సాగుతున్నాయన్నారు. ప్రసుత్తం పూలతోట, ఏకొల్లు, వెదురుపట్టు తదితర గ్రా మాల్లోని చెరువు కట్టల పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. మిగిలిన చెరువుల పనులు అన్ని కూడా పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.